## క్లుప్తంగా

### నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

### ఎరువుల కొరత లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం: ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండలంలోని బూసాయవలస గ్రామాన్ని శుక్రవారం సందర్శించిన ఆయనను కొంతమంది విలేకరులు కలిసి, రైతులు ఎదుర్కొంటున్న ఎరువుల కొరతపై ప్రశ్నించారు. స్పందించిన ఎమ్మెల్యే.. యూరియా, డీఏపీ తదితర ఎరువులు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. అలాగే సాగునీటి ఇబ్బందులు లేకుండా ఇరిగేషన్ పనులకు ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని అధికారులకు తెలిపామన్నారు.

### సరైన పత్రాలుంటేనే ఇసుక

బొబ్బిలి రూరల్: సరైన పత్రాలు చూపిస్తేనే ఇసుక సరఫరాకు అనుమతులు ఇస్తామని తహసీల్దారు శ్రీను అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఇసుక సరఫరా నిమిత్తం నిర్వహిస్తున్న స్లాట్ బుకింగ్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. తప్పుడు ధ్రువపత్రాలు చూపి, ఇసుక తీసుకువెళ్లడం నేరమన్నారు. ఎవరైనా ఎక్కడైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### యుద్ధప్రాతిపదికన పైపులైన్ మరమ్మతులు



పైపులైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

బొబ్బిలి: పట్టణంలోని రాణిమల్లమ్మ మున్సిపల్ పార్కు వద్ద ఉన్న ప్రధాన తాగునీటి సరఫరా పైపులైన్ మరమ్మతులను శుక్రవారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. పైపులైన్‌కు రంధ్రం పడిన విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు ఉదయం దగ్గరుండి పైపులైన్‌ను బాగుచేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు కౌన్సిలర్లు పాలవలస ఉమాశంకర్, సవలాపురపు రామకృష్ణ, ఇంటి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

### వ్యాసరచన పోటీలు



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న ఆప్తాలమిక్ అధికారి వసంతరావు

రాజాం సిటీ: నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక నైటింగేల్, మదర్ థెరీసా నర్సింగ్ కళాశాలల్లో నేత్రదాన ఆవశ్యకత అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ అన్నిదానాలలో కన్నా నేత్రదానం గొప్పదని, మనం దానం చేసే కళ్లు మరో ఇద్దరికి చూపును ఇస్తాయన్న విషయం మర్చిపోవద్దన్నారు. నేత్రదానానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కళావతి, తదితరులు పాల్గొన్నారు.

### కన్యకాపరమేశ్వరికి సారె సమర్పణ



సారె అందజేస్తున్న వాసవీ క్లబ్ వనితాశక్తి సభ్యులు

రాజాం: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కొలువైన కన్యకాపరమేశ్వరి అమ్మవారికి రాజాం వాసవీ క్లబ్ వనితాశక్తి సభ్యులు శుక్రవారం సారె సమర్పించారు. 30 రకాల పిండి వంటకాలను నైవేద్యంగా పెట్టి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ వనితాశక్తి ప్రెసిడెంట్ పొట్టా శ్రీదేవి, కార్యదర్శి బండి అరుణకుమారి, కోశాధికారి ఆర్.కన్యాకుమారి, ఆలయ అర్చకులు ఆరవెల్లి గణపతిశర్మ, మురపాక నర్సింగరావు శర్మ తదితరులు పాల్గొన్నారు.

---

**భద్రతకు భరోసానివ్వాలి..**



వైద్య సిబ్బంది భద్రతకు ప్రభుత్వాలే భరోసా ఇవ్వాలి. ఎక్కడికక్కడ వైద్యులపై దాడులు జరగుతుండడం విచారకరం. నిందితులకు కఠిన శిక్షలు అమలు చేయాలి. ఎటువంటి భయం లేకుంటేనే ప్రశాంతంగా ఉద్యోగం చేయగలుగుతాం. ప్రజలకు ధైర్యంగా సేవలు అందించగలుగుతాం. నైట్ వాచ్‌మన్‌లు, సెక్యూరిటీ గార్డ్‌లు తప్పనిసరిగా ఉండాలి.
– రీనా చౌదరి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, బూరాడ, రేగిడి మండలం

**చట్టాలను కఠినతరం చేయాలి..**



వైద్యారోగ్య సిబ్బందిపై దాడులకు ఎగబడుతున్న వారికి శిక్షలు విధించే చట్టాలను కఠినతరం చేయాలి. ఇంకోసారి ఎవరైనా చెడ్డ పని చేయాలంటే భయం పుట్టాలి. ప్రతీ ఆరోగ్య కేంద్రం వద్ద రక్షణగా సెక్యూరిటీ గార్డులు కచ్చితంగా ఉండాలి. ఆస్పత్రిలో, బయట వైద్య శిబిరాలు జరిగే చోట హెల్త్ ఎంప్లాయీస్ ప్రొటెక్షన్ టీమ్‌లు ఏర్పాటు చేసి, పనిచేసేలా చూడాలి.
– ఎస్.రాజేశ్వరి, ఆరోగ్య కార్యదర్శి, చాటాయివలస, రేగిడి మండలం

# పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

హరితాంధ్రే లక్ష్యంగా వనమహోత్సవం శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణల్లో సిబ్బంది మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఇప్పుడు మనం నాటే మొక్కలు భవిష్యత్ తరాల బంగారు భవితకు బాటలు వేస్తాయన్న విషయం అందరూ గుర్తెరగాలన్నారు.
– బొబ్బిలి, రాజాం



రేగిడి: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో శ్యామలాకుమారి, తదితరులు



రామభద్రపురం: ఎంపీడీవో కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీపీ లక్ష్మణరావు, ఎంపీడీవో రమామణి



తెర్లాం: నందిగాం సచివాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు, ఎంపీడీవో రామకృష్ణ



సంతకవిటి సచివాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు



రాజాం సిటీ: మండల కేంద్రంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ అధికారుల సైకిల్ ర్యాలీ



రాజాం జీఎంఆర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



బొబ్బిలి రూరల్: ఎం.బూర్జివలసలో మొక్కలు నాటుతున్న అధికారులు



రేగిడి: ఉంగరాడమెట్ట గురుకుల పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంఈవో ఎరకయ్య, తదితరులు



బొబ్బిలి: మండల కేంద్రంలోని మల్లందేవి పార్కు చెరువు వద్ద మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

# సిరిపురం పాఠశాలకు అవార్డు



పీడీ సన్నిబాబును అవార్డుతో సత్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

సంతకవిటి: మండలంలోని సిరిపురం గ్రామ ప్రభుత్వ పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచి, జిల్లాలో తొలి ఐదు స్థానాల్లో నిలిచిన పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఈ అవార్డు ఇస్తోంది. 2022–2023 విద్యా సంవత్సరంలో తమ పాఠశాల విద్యార్థులు పలు క్రీడల్లో సత్తా చాటినందుకు గాను ఈ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటరావు, పీడీ సన్నిబాబు తెలిపారు. వరుసగా రెండో ఏడాది కూడా పాఠశాలకు అవార్డు రావడం పట్ల సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విజయనగరం జిల్లాలోని రాజీవ్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, డీఈవో ప్రేమ్‌కుమార్‌ల చేతుల మీదుగా పీడీ సన్నిబాబుకు అవార్డు అందజేసి, సత్కరించారు.

**ఆరికతోట పాఠశాలకు..**

రామభద్రపురం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డుకు ఆరికతోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో ఎంపికైనందున ఆ పాఠశాల పీడీ వి.అప్పలనాయుడును విజయనగరంలో కలెక్టర్ అంబేడ్కర్, డీఈవో ప్రేమ్‌కుమార్ జ్ఞాపిక, శాలువాలతో ఘనంగా సత్కరించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ (క్రీడాప్రతిభా) అవార్డులకు సుమారు 400 పాఠశాలలు పోటీపడగా, వాటిలో మొదటి ఐదు పాఠశాలలను ఎంపిక చేశారని, అందులో ఆరికతోట ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో ఎంపికై, అవార్డు కైవసం చేసుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు జీసీహెచ్ఎస్ శర్మ తెలిపారు.

# మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రామభద్రపురం: మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, ఆ దిశగా చర్యలు చేపడుతున్నామని డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ నారాయణరావుతో కలిసి శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. రామభద్రపురం మండల కేంద్రం అంతర్‌రాష్ట్ర కూడలి కావడంతో గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మాదకద్రవ్యాల రవాణా సులభంగా జరుగుతోందన్న సమాచారం కారణంగా ఈ ప్రాంతంపై నిఘా ఉంచామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడి మీదుగా మత్తు పదార్థాల రవాణా జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య ఘటన నేపథ్యంలో ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాత్రిపూట కూడా పోలీసులు ప్రతీ పీహెచ్‌సీని సందర్శించేలా పాయింట్ బుక్‌లు పెడుతున్నామన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వినాయక చవితి పండగ కోసం ఏర్పాటు చేసే గణేశుని మండపాల కోసం అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు ఎలాంటివి తీసుకుంటున్నారు.. వేడుకలు ఎన్నిరోజులు చేస్తున్నదీ.. నిమజ్జనం తేదీ, సమయం వంటి అన్ని వివరాలు తెలియజేయాలన్నారు. పండగ దినాల్లో పగలు 55, రాత్రి 45 డెసిబుల్స్ మించకుండా ఉండేలా సౌండ్‌బాక్సులు వినియోగించేలా సూచనలు చేస్తున్నామన్నారు.

# ఆరోగ్య తనిఖీలు



వంగర: విద్యార్థినులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి ఈశ్వరరావు



రేగిడి: వండానపేటలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యాధికారిణి రోహిణీ రాఘవ్

వంగర: మండలంలోని మడ్డువలస దగ్గరున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు శుక్రవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. వైద్యాధికారి కలమటి ఈశ్వరరావు ప్రతీ విద్యార్థినికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఈశ్వరి, సుభ, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని వండానపేట గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన ప్రతీ వ్యక్తికి రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి రోహిణీ రాఘవ్ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

### నేడు పింఛన్ల పంపిణీ

రామభద్రపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం జరుగుతుందని ఎంపీడీవో రమామణి శుక్రవారం తెలిపారు. మండలంలో మొత్తం 7,781 మంది పెన్షన్‌దారులు ఉన్నారని, వీరి కోసం రూ.3.15 కోట్లు మంజూరైందన్నారు. 524 క్లస్టర్లలో 154 మంది సిబ్బంది పింఛన్ల పంపిణీ చేపడతారన్నారు.

### కోరం లేకుండా ఎన్నిక ఎలా?



విలేకరులతో మాట్లాడుతున్న గణేష్ తదితరులు

గజపతినగరం రూరల్: మండలంలోని కెంగువ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఎన్నిక కోరం లేకుండానే అధికారులు నిర్వహించడం దారుణమని వైఎస్సార్‌సీపీ నాయకుడు లెంక గణేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొండల అప్పయ్యమ్మ, సూరిబాబు దంపతుల కుమార్తె కొండల దుర్గ పాఠశాలలో 3వ తరగతి చదువుతుందని, అయితే ఎన్నికకు సంబంధించి దుర్గ తల్లిదండ్రులు ఇరువురూ లేకుండానే వారి స్థానంలో వేరే వారితో వేలిముద్రలు వేయించి అధికార పార్టీకి చెందిన నాయకులు ఎన్నికను జరిపించారని ఆరోపించారు. ఈ ఎన్నిక చెల్లదని, తక్షణమే రద్దు చేయాలని లేకుంటే కోర్టును ఆశ్రయిస్తామని గణేష్ తెలిపారు. ఆయనతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

# రైస్‌మిల్లు కార్మికులకు తీవ్ర అన్యాయం



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు

రాజాం: పట్టణంలోని రైస్‌మిల్లు కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, రాజాం సీఐటీయూ నాయకుడు పి. విశ్వనాథం ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని డొంకల రైస్‌మిల్లు వద్ద రాజాం ప్రాంతీయ రైస్‌మిల్లు కార్మికుల సర్వసభ్య సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు లేవని, పీఎఫ్ కట్ అవుతున్న కార్మికులకు పెన్షన్ కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 50 కిలోలకు దాటి బరువులను మోయరాదన్న నిబంధనలు ఉన్నా 100 కిలోల బరువులను కూడా మోయిస్తున్నారన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం సైతం రైస్ మిల్లు కార్మికులను పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. అనంతరం రైస్‌మిల్లు కార్మికుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. రాజాం అధ్యక్షుడిగా పోరెడ్డి విశ్వనాథం, కార్యదర్శిగా కంచినాయుడు, ట్రెజరర్‌గా చిట్టినాయుడు, గౌరవాధ్యక్షుడిగా శంకరరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

# ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి, అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఇదే విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. పండగకు సంబంధించి, ప్రత్యేక యాప్ ఉందని, అందులో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వేడుకల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు తీసుకుంటున్న చర్యలను తెలియజేయాల్సి ఉంటుందన్నారు. పోలీసుల అనుమతి లేకుండా వేడుకలు నిర్వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆయన వెంట సీఐ సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### అప్రమత్తంగా ఉండాలి

రాజాం: ఫ్లోరోసిస్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ ఎల్.అరుణజ్యోతి సూచించారు. మండలంలోని పెనుబాక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, గ్రామస్తులకు వ్యాధి నివారణ చర్యలపై శుక్రవారం అవగాహన కల్పించారు. కలుషిత నీటి ప్రభావంతో ఫ్లోరోసిస్ వ్యాధి వస్తుందని, ప్రతిఒక్కరూ రక్షిత మంచినీటి పథకం ద్వారా వచ్చే సురక్షితమైన మంచినీటినే తాగాలన్నారు.

వ్యాధి లక్షణాలతో ఎవరైనా బాధపడితే వెంటనే ఆస్పత్రిని సంప్రదించి, చికిత్స పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు



రేగిడి: దేవుదళ గీతాశ్రమంలో భక్తుల పూజలు



రాజాం సిటీ: గాయత్రి ధ్యాన మందిరంలో కుంకుమపూజలు చేస్తున్న భక్తులు

రాజాం/రాజాం సిటీ/రేగిడి/రామభద్రపురం/బొబ్బిలి: మండలాల్లోని అన్ని గ్రామాల్లో శ్రావణమాస పూజలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చివరి శ్రావణ శుక్రవారం కావడంతో వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. లక్ష్మీదేవికి విశేష పూజలు చేసి, అమ్మవారి ఆశీర్వచనాలు అందుకున్నారు.

# పత్ర ద్రావణం తయారీపై అవగాహన



పత్ర ద్రావణం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వంగర: మండలంలోని మండలంలోని మరువాడ గ్రామంలోని రైతులకు బహుపత్ర ద్రావణం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం యూనిట్ యాంకర్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు తొలుత ప్రయోగపూర్వకంగా ద్రావణం తయారీని వివరించి, దాని ప్రయోజనాలు తెలిపారు. వేప, జిల్లేడు, కాగు, సీతాఫలం, జామ, బొప్పాయి ఆకులతో పాటు వెల్లుల్లి, పచ్చిమిరపకాయలు, పొగాకు కాడలు వంటివి దంపుడు చేసిన దానిని తగినంత నీటిలో తీసుకుని, వారం రోజులపాటు కలియబెట్టాలన్నారు. ఆ తర్వాత దానిని తగిన మోతాదులో పంటపై పిచికారీ చేస్తే పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్లు తొలగిపోతాయన్నారు. ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు.

# ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయండి



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జేడీ రామారావు

రాజాం సిటీ: రైతులు వేసుకున్న పంటలకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ జేడీ వి.టి.రామారావు ఆదేశించారు. మండలంలోని బొద్దాం గ్రామంలో చేపడుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను శుక్రవారం పరిశీలించిన ఆయన.. రైతులు సాగు చేస్తున్న అన్నిరకాల పంటలకూ ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలని సూచించారు. సెప్టెంబరు 15వ తేదీ వరకు గడువు ఉందని, ప్రతీ రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కె.చంద్రరావు, ఏవో ఎం.రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

# హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన అవసరమని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సోపేరు గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం శుక్రవారం నిర్వహించి, పౌరహక్కులను తెలియజేశారు. అనంతరం ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలని ఎంపీడీవో అడగ్గా, శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని దళితవాడ ప్రజలు కోరారు.